# అనాదిగా స్త్రీ

♦ ఆకుమళ్ళ పద్మరాజ్యలక్ష్మి

సుశీల కంగారుగా వుంది. మాటి మాటికీ వాచీ చూసుకుంటూ వేగంగా నడుస్తోంది. ఒక చేత్తో బేగ్‌నీ, మరో చేత్తో చీర కుచ్చిళ్ళనీ పట్టుకుని పరుగులాంటి నడకతో వెళ్తోంది.

సమయం ఎనిమిది కావస్తోంది. లేత ఎండలో చిరు చెమటలు అలుముకున్న సుశీల ముఖం పచ్చగా మెరుస్తోంది. పైట నిండుగా కప్పుకుని తలవంచుకుని వెళ్ళే సుశీలని చూస్తే ఎవరికైనా గౌరవభావం కలుగుతుంది. తన పనేదో తను చూసుకోవటం తప్ప ఇతరుల విషయాల్లో జోక్యం కలుగచేసుకోవడం, అనవసర ప్రసంగాల్లో తలదూర్చటం లాంటివి ఆమెకు తెలీవు. సహజంగా మితభాషి. పెద్ద రూపసి కాకపోయినా, మధ్యతరగతి కంటే ఓ స్థాయి తక్కువదైనా, తెలిసిన పలుకుబడిగలవాళ్ళు లేకపోయినా ఆమె కేవలం తన ప్రవర్తనతోనూ, మంచితనంతోనూ గతంలో పనిచేసిన మూడు నాలుగు స్కూళ్ళలోనూ ఎంతో మంచి పేరు తెచ్చుకుంది.

ఇప్పుడు ఇంకాస్త ఎక్కువ జీతం ఇవ్వగల మరో ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా అపాయింట్‌మెంట్ వచ్చింది.

టైలరింగ్ ద్వారా తనని పోషించి వార్ధక్యంలో జబ్బుపడిన తల్లికి మంచి ట్రీట్‌మెంట్ ఇప్పించాలని సుశీల తాపత్రయం.

తను చేరిన స్కూల్ చాలా స్ట్రిక్టనీ, ప్రతిదీ టైమ్ ప్రకారం జరుగుతుందనీ హెడ్‌మిసెస్ చెప్పడంవల్లనేకాక కళ్ళారా చూడ్డంవల్ల కూడా గ్రహించింది సుశీల. ఎంత ప్రయత్నించినా ఒక్కోరోజు మొద్దునిద్రతో త్వరగా లేవలేక టైమ్‌కు తయారవలేక అవస్థపడుతూ వుంటుంది. కరెక్ట్‌గా ప్రేయర్ టైమ్‌కి స్కూల్‌కి చేరాలని ఉరుకులు పరుగులతో వెళుతోంది. అయిదు నిముషాలు లేటయినా హెడ్‌మిసెస్ ఇంతవరకూ సుశీలని ఏమీ అనలేదుకానీ, కళ్ళజోడు సరిచేసుకుంటూ తీక్షణంగా చూస్తుంది. ఆ చూపులకే సుశీల గుండెలు హడలెత్తుతాయి.

సుశీల వెళ్ళేసరికి పిల్లలందరూ ప్రేయర్‌కి నిల్చుంటున్నారు.

సుశీల తోటి టీచర్స్ దగ్గర నిల్చుని దూరంగా వున్న హెడ్‌మిసెస్‌ని చూస్తుంటే వెనుక నుంచి వినిపించింది – "ఎందుకలా భయపడతారు? ఆవిడ మిమ్మల్నేమీ కొరుక్కుతినదు."

సుశీల తలతిప్పి చూసింది. సీనియర్ అప్పారావు. వెకిలిగా చూస్తున్నాడు. సుశీల ఇబ్బందిగా తలతిప్పుకుంది.

తను స్కూల్లో చేరిన మొదటినుంచీ గమనిస్తోంది. అప్పారావు ప్రవర్తన విచిత్రంగా వుంది. తనకి సన్నిహితంగా రావాలని చూస్తుంటాడు. స్కూల్లోని కొద్దిపాటి యువకులైన మగ టీచర్లలో అతనూ ఒకడు. పెద్ద రూపవంతుడూ కాదు, అనాకారీ కాదు. మామూలుగా వుంటాడు. పెళ్ళయిన రెండేళ్ళకే అతని భార్య ఆత్మహత్య చేసుకుందని వినికిడి.

ఏ మాత్రం లీజరు దొరికి తను కనిపించినా "సుశీలగారూ!" అంటూ మాటలు పెంచుకోచూసే అతని తీరు సుశీలకి ఇబ్బందిగా వుంది.



1-7-94 ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక

**తెలుగు కళాసమితి న్యూజెర్సీ, రాజాలక్ష్మి ఫౌండేషన్ వారి కథల పోటీలో రూ. 500/- బహుమతి పొందిన కథ**

అతను తన దగ్గర వున్నప్పుడు రెండు కళ్ళు తమిద్దరిపీ తదేకంగా చూస్తుం డటం సుశీల గమనించకపోలేదు. ఇది మరింత ఇబ్బందిగా తోచేది సుశీలకి.

అతను తనతో మాటలు పెంచుకో వడానికి ప్రయత్నించినప్పుడంతా 'నాకు వేరే పనుంది' అని మృదువుగా త్రుంచేసి తప్పించుకోవాలని ఎన్నిసార్లో అనుకుంది. కానీ చెప్పలేకపోయింది.

'తను ఊరికే అపోహపడుతోందేమో, అతను ఎవరితోనైనా అలాగే మాట్లా డతాడేమో. అతనికి తను అనుమాని స్తున్న భావం లేకపోవచ్చునేమో' అన్న ఆలోచనలు కూడా ఆమె మౌనానికి కారణాలు.

ప్రేయర్ అయిపోయిన తర్వాత తన క్లాస్‌లోకి వెళుతూ సుశీల వెనుది రిగి చూసింది. ఆమె ఊహించినట్లే అందరిలా క్లాస్‌కెళ్ళక నిర్మానుష్యమైన గ్రౌండ్‌లో వంటరిగా నిల్చుని అప్పారావు ఆమెనే చూస్తున్నాడు. ఆమె తనని చూడగానే చిరునవ్వు నవ్వాడు. సుశీల ఎప్పటిలాగే ప్రతిగా నవ్వనూ లేదు, ముఖం చిట్లించనూ లేదు. మామూలుగా తలతిప్పుకుని క్లాస్‌రూం లోకి నడిచింది.

ఆమె లోపలికెళ్ళేంతవరకూ చూసి తర్వాత వెళ్ళాడు అప్పారావు తన క్లాస్‌కి.

ఆరోజు స్కూలు వదులుతూనే సుశీల ఇంటిదారి పట్టింది.

అప్పారావు ఆమె పక్కగా నడుస్తూ "సుశీలగారూ! మీతో కొంచెం పర్సన ల్‌గా మాట్లాడాలి. అలా పార్కుకెళ్ళి మాట్లాడుకుందాం. ప్లీజ్ కాదనకండి" అన్నాడు.

తటపటాయిస్తూనే అతని వెంట నడి చింది.

పార్కులోకి రాగానే అప్పారావు సుశీల ఊహించని విధంగా "సుశీలా! ఐ లవ్ యూ. నీవు లేకుండా నేను బ్రత కలేను" అన్నాడు ఆమె చేయి పట్టు కుంటూ. అంతటితో ఆగక హఠాత్తుగా ఆమె దోసిలిలో ముఖాన్ని దాచుకుని బోరున ఏడ్చేశాడు.

"నేను పెళ్ళి చేసుకున్నానన్న మాటే గానీ జీవితంలో ఎప్పుడూ సుఖం అను భవించలేదు. నా చిన్ననాటి స్నేహితు రాలు ఉషని తల్చుకుంటూ గడిపేవా డివి. అది తప్ప నా భార్యకి ఏ లోటూ చెయ్యలేదు. ఉషని ప్రేమించా నని, పెద్దలు అంగీకరించకపోవటం వల్ల చేసుకోలేకపోయానని నేను నా భార్యకి పెళ్ళికి ముందే చెప్పాను. తెలిసే చేసుకుంది. ఉషని మర్చిపొమ్మంది. నావల్ల కాదన్నాను. అసంతృప్తితో ఆత్మ హత్య చేసుకుంది. నేను ఉష జ్ఞాప కాల్లో మరింతగా లీనమయ్యాను. అలాంటి సమయంలో మీరు తటస్థ పడ్డారు. మిమ్మల్ని చూసి దిగ్భ్రాంతి చెందాను. మీరచ్చు నా ఉషలా వున్నారు. మిమ్మల్ని వదిలి నేనుం డలేను సుశీలగారూ! నన్ను పెళ్ళి చేసుకుంటారా? ప్లీజ్ ..."

"ఆలోచించి చెబ్తానండీ!" అంటూ గబుక్కున అతని చేతులు విడిపిం చుకుని పార్కు బయటికి నడిచింది సుశీల.

రెండు నెలల తర్వాత ...

గేటు చప్పుడుకి సుశీల తలెత్తి చూసింది. రమణి టీచరు. సుశీల ఎదురొచ్చి లోనికి ఆహ్వానించింది.

"ఏం సుశీలా, స్కూల్‌కి రావటం లేదు?"

" ... "

"నువ్వూ, అప్పారావూ పెళ్ళి చేసు కోవటంలేదా? పత్రికలు అందరికీ పంచాక ఎందుకిలా విరమించుకు న్నారు?"

" ... "

"నువ్వతన్ని చేసుకోవటం నాకు మొదట్నుంచీ ఇష్టంలేదు. నాకతని గురించి పూర్తిగా తెలుసు. గోము ఖవ్యాఘ్రం. ఒకటి రెండుసార్లు నిన్ను హెచ్చరిద్దామనుకున్నాను. జోక్యం చేసు కుంటే నా ప్రాణాలు దక్కవని అతను నన్ను బెదిరించాడు. ఇంతకీ పత్రికలు కూడా అచ్చయ్యాక పెళ్ళి చేసుకోనన దానికి కారణం ఏమిటి సుశీలా?"

"ఇంతకీ రమణిగారూ! మీకతని గురించి బాగా తెలుసునని అంటు న్నారు. ఎలా తెలుసు? స్కూల్లో అతను నాతో మాట్లాడుతున్నప్పుడంతా మీరు గమనించేవారా" అంది సుశీల.

"అతని చిన్ననాటి స్నేహితురాలు ఉషని నేనే. నా పూర్తిపేరు ఉషార మణి. పెద్దలు అంగీకరించకపోవడం వల్ల నన్ను చేసుకోలేకపోయానన్నది అబద్ధం. అగ్నిప్రమాదంలో కాలిపోయి వికృతంగా తయారయ్యానని నన్ను అది వరకు గాఢంగా ప్రేమించిన అప్పారావు అసహ్యించుకున్నాడు. కట్నం తేలేదని చేసుకున్న భార్యని కూడా హింసిం చాడు. అందుకే ఆమె ఆత్మహత్య చేసుకుంది" చెప్పింది ఉషారమణి.

అప్పారావు పట్లా, ఆయన చెబు తున్న ప్రేమపట్లా తనకు నమ్మకం కలగలేదనీ, ఆలోచిస్తూండగానే అప్పా రావు పెళ్ళి పత్రికలవరకూ వెళ్ళడంతో మరింత అనుమానపడి ఆపమన్నట్టు సుశీల చెప్పింది.

ఇద్దరూ గాఢంగా నిట్టూరుస్తూ వీధి లోకి చూస్తుండగా కొత్తగా చేరిన విమలాటీచరుతో అప్పారావు పార్కుకి పోతూ కనిపించాడు.

ఇద్దరూ కన్నీళ్ళతో, కన్నీళ్ళలో మెరిసే నవ్వులతో ఒకర్నొకరు చూసుకున్నారు. ఆ నవ్వుల్లో అప్పారావుల పట్ల అస హ్యమూ, తమ పట్ల తమకున్న విశ్వా సమూ వ్యక్తమవుతోంది.

## ◆ ఇ.వి.వి. సెంటిమెంట్ ◆



సెంటిమెంట్స్‌కు విలయమైన చలనచిత్ర ప్రపంచంలో క్రేజీ డైరె క్టర్ ఇ.వి.వి. సత్యనారాయణకూ ఓ సెంటిమెంట్ వుంది. తన సిని మాలలో హీరోయిన్ చేత 'స్విమ్ సూట్' ధరింపచేస్తే ఆ సినిమా సూపర్ హిట్ అవుతుందనే గట్టి నమ్మకం ఆయనకుంది. ఇంతవ రకు ఆ నమ్మకం ఏ సినిమా విష యంలోనూ వమ్ముకాలేదు. ప్రేమ ఖైదీ, సీతారత్నంగారి అబ్బాయి, ఆ ఒక్కటి అడక్కు, వారసుడు, హలోబ్రదర్ చిత్రాలలో హీరోయి న్‌లు స్విమ్‌సూట్స్ వేసుకున్నారు. అవి సూపర్ హిట్ అయ్యాయి. ఆయన డైరెక్ట్ చేసిన మిగతా పిక్చర్స్‌లో ఆ ఆ కథానాయికల ఇమేజ్ దృష్ట్యా వారికి స్విమ్ సూట్స్ వాడలేదు. ఆ సినిమా ఏవరేజుగా మాత్రమే ఆడాయి. అవి చెవిలో పువ్వు, శ్రీ 420, అప్పుల అప్పారావు, అబ్బాయిగారు, జంబలకిడి పంబ, అలిబాబా అర డజను దొంగలు మొదలైనవి.

\- రత్న

"ఆలోచనలతో నా బుర్ర వేడె క్కిపోయింది. ఆలస్యంగా వచ్చి నందుకు కథలేమీ చెప్పకుండా ఆరగించండి" కంచంలో అన్నీ విసురుగా పడేసి వెళ్ళబోయింది భార్య.

"ఆగాగు" అని తన భోజన పళ్ళెం ఆమె తలపై పెట్టాడు భర్త.

"అన్నం చల్లారిపోయింది. కాస్త వేడి చేసుకుంటాను" అన్నాడు.

\- వి.గోపాలకృష్ణ

